వైభవంగా వెండి మొక్కుజోడు సేవోత్సవం

స్వామి,అమ్మవార్లను ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఆగస్టు 28: యాదగిరిగుట్ట లక్ష్మీనర సింహస్వామి ప్రధానాలయంలో బుధవారం వెండి మొక్కు జోడు సేవోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా అలంకరించారు. స్వామివారిని గరుఢ వాహనంపై, అమ్మవారిని తిరుచ్చీ సేవపై వేంచేపు చేసి తిరుమాఢవీధుల్లో ఊరేగించారు. ప్రధానాలయ మొదటి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ అర్చకులు హోమం జరిపారు. స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ సేవ వైభవంగా సాగింది. ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవసేవ జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతును చేపట్టారు. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తిరువారాధన జరిపారు. ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 12 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.21,66,584 ఆదాయం సమకూరిందని అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

నేడు రుక్మిణీదేవి కల్యాణం

యాదగిరిగుట్ట ప్రధానాలయంలో గోకులాష్టామి వేడుకలు కొనసాగుతున్నాయి. బుధవారం నిత్య కైంకర్యాల అనంతరం వైశేషిక పూజలు నిర్వహించారు. సాయంత్రం కణ్ణన్ తిరునక్షత్ర మహోత్సవంలో భాగంగా విశేష సేవతో పాటు తిరుమాఢవీధుల్లో ఊరేగించారు. గురువారం సాయంత్రం 5 గంటలకు ఆలయ తిరుమాఢవీధుల్లో ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహించనున్నారు. రాత్రి స్వామివారి ఆలయంలో రుక్మిణీ కల్యాణోత్సవం నిర్వహించనున్నారు.

30న భువనగిరికి మంత్రి ఉత్తమ్ రాక

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి


అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 28: రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఈ నెల 30న భువనగిరికి రానున్నారు. ఈ సందర్భంగా నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. సమావేశ స్థలంతో పాటు హెలీప్యాడ్ ప్రాంతాన్ని బుధవారం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఉన్న సాగునీటి కాల్వల సమస్య పరిష్కారానికి మంత్రి ఉత్తమ్ నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హనుమంతు కె. జండగే, అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సస్యరక్షణపై రైతులకు అవగాహన

బెండ తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, విద్యార్థినులు

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 28 : మండలంలోని వీరవెల్లి, చందుపట్ల గ్రామాల్లో బుధవారం ఏరువాక శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు పర్యటించారు. గ్రామంలో రైతులు సాగు చేసిన పంట చేలను పరిశీలించారు. వరిలో సకాలంలో కలుపు నివారణ చర్యలు చేపట్టాలని, కాండం తొలిచే పురుగు ఉధృతి నివారణ, పత్తిలో రసం పీల్చే పురుగులు, బెండ చేలో కాండం, కాయ తొలిచే పురుగుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థినులు దీప్తి, పూజ, పూజిత, ఝాన్సీ, సుభాషిణి, అంజలి, భవాని పాల్గొన్నారు.


ధర్మానాయక్‌ను సన్మానిస్తున్న స్టడీసెంటర్ నిర్వాహకులు, అధ్యాపకులు

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా మెరుగైన విద్యాబోధన

- **యునివర్సిటీ జాయింట్ డైరెక్టర్ ధర్మానాయక్**

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 28 : బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో చేరే విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందిస్తున్నట్లు యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ ధర్మానాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని లక్ష్మీ నరసింహస్వామి డిగ్రీ కళాశాలలో ఉన్న యూనివర్సిటీ స్టడీ సెంటర్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్టడీ సెంటర్ నిర్వాహకులు, అధ్యాపకులతో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. స్టడీ సెంటర్‌లో ఎక్కువ మంది విద్యార్థులను చేర్పించేందుకు ఔట్ రీచ్ కార్యక్రమాలు, మెరుగైన అకడమిక్ అఫర్లు, మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సుధారాణి ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా మాట్లాడారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు విజయాలు సాధించడానికి అవసరమైన నైపుణ్యాలను, పరిజ్ఞానాన్ని అందించడానికి అధ్యయన కేంద్రాలు ప్రయత్నాలు చేయాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా స్టడీ సెంటర్ కోఆర్డినేర్ డాక్టర్ గంజి రమేశ్ వినతిపై స్టడీ సెంటర్‌కు కావాల్సిన ఫర్నీచర్, లాప్‌టాప్, ప్రింటర్ వంటి వాటిని సమకూర్చేందుకు ధర్మానాయక్ హామీ ఇచ్చారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శ్రీనివాస్, స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.రమేశ్, స్టడీ సెంటర్ జాక్టో బాలయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- **ఏడీ పీహెచ్‌ఓ మనోహర్**

రోగులతో మాట్లాడుతున్న ఏడీ పీహెచ్‌ఓ మనోహర్

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 28 : సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా అడిషనల్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మనోహర్ ఆదేశించారు. బుధవారం మండలంలోని పిల్లాయిపల్లి గ్రామంలోని ఆయుష్ ఆరోగ్య మందిరాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య మందిరంలో అందుతున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని, దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డెంగీ, మలేరియా జ్వరాలను నిర్ధారించేందుకు వీలుగా పరీక్షా కిట్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట ఆరోగ్య మందిర్ వైద్యాధికారి డాక్టర్ సందీప్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

- **జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రామకృష్ణ**


రాఘవాపురం సబ్‌సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రామకృష్ణ

బీబీనగర్, ఆగస్టు 28 :తల్లిదండ్రులు తమ చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలను తప్పక వేయించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కె. రామకృష్ణ సూచించారు. బుధవారం బీబీనగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. వ్యాక్సినేషన్ వివరాలు, టీకాల నిల్వల గురించి ఫార్మసిస్ట్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీహెచ్‌సీ పరిధిలోని రాఘవాపూర్ సబ్‌సెంటర్‌ను సందర్శించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి రక్తహీనత, పౌష్టికాహార లోపం, గర్భిణులు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. చిన్నారులకు ఇవ్వాల్సిన టీకాలపై తల్లిదండ్రులకు వివరించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, జ్వర కేసులు ఎక్కువ మొత్తంలో నమోదవుతున్నాయని, అందువల్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట వైద్యాధికారి డాక్టర్ మౌనిక, సీహెచ్‌ఎన్ ఆరోగ్యమ్మ, ఏఎన్‌ఎం, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిధులు

- **ఎమ్మెల్సీ నర్సిరెడ్డి**

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

చౌటుప్పల్, ఆగస్టు 28 : రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిదులు కేటాయించడం సరికాదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. బుధవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ జిల్లా సమరభేరి సైకిల్ యాత్ర ముగింపు సభలో ఆయన మాట్లాడారు. నిధులు లేక ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలు, పాఠశాలలు సమస్యలకు నిలయాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను ప్రజలకు ఉచితంగా అందించాలన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. చౌటుప్పల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లావుడియా రాజు, చింతల శివ, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె మధుకృష్ణ, నాయకులు బోదాసు వెంకటేశం, పల్లె శివకుమార్, ఈర్ల రాహుల్, వేముల నాగరాజు, కాసుల నరేశ్, తీగుళ్ల శ్రీనివాస్, ఈర్ల కార్తీక్, నరేందర్, మహేశ్, సాయి పాల్గొన్నారు.

షరతులు లేకుండా అర్హులందరికీ రుణమాఫీ చేయాలి

- **సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు**

సమావేశంలో మాట్లాడుతున్న గోద శ్రీరాములు

చౌటుప్పల్, ఆగస్టు 28 : అర్హులైన రైతులందరికీ షరతులు లేకుండా రుణమాఫీ వర్తింప జేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ మార్గదర్శకాలను సవరించాలన్నారు. రైతులు రుణమాఫీ విషయంలో అయోమయానికి గురవుతున్నారని, ప్రతి రోజూ బ్యాంకుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి పల్లె శేఖర్‌రెడ్డి, నాయకులు దుబ్బాక భాస్కర్, పగిళ్ల మోహన్‌రెడ్డి, సంజీవ, ఉడుతు రామలింగం, కొండూరి వెంకటేశం, సుధాకర్, నేనావత్ రవి పాల్గొన్నారు.

ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలి

- **సీపీఐ జిల్లా నాయకుడు చెక్క వెంకటేశ్**

మాట్లాడుతున్న సీపీఐ జిల్లా నాయకుడు వెంకటేశ్

ఆలేరురూరల్, ఆగస్టు 28 : ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేశ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆలేరు పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలేరు మండలంలోని అన్ని గ్రామాలల్లో ఉన్న ప్రభుత్వ భూములను అర్హులైన నిరుపేదలకు ఇవ్వాలన్నారు. అర్హులైన రైతులందరికీ షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు చౌడబోయిన కనకయ్య, పొన్నబోయిన రవి, ఆంజనేయులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతుల వివరాల సేకరణ

రైతుతో సెల్ఫీ దిగుతున్న ఏఓ సుధారాణి

యాదగిరిగుట్ట, ఆగస్టు 28: రేషన్ కార్డు లేక రుణమాఫీ నిలిచిపోయిన రైతు కుటుంబాల వివరాల నమోదు కార్యక్రమాన్ని బుధవారం మండలంలోని మాసాయిపేట గ్రామంలో మండల వ్యవసాయ అధికారి సుధారాణి ప్రారంభించారు. రుణమాఫీ కాని రైతుల ఇంటికి వెళ్లి ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు చేశారు. రైతు కుటుంబ సభ్యులతో సెల్ఫీదిగి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ఆమె వెంట ఏఈఓ ప్రణయ్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి పూర్వ విద్యార్థుల సాయం

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

భూదాన్‌పోచంపల్లి , ఆగస్టు 28 : మండలంలోని పిలాయిపల్లి గ్రామానికి చెందిన పాలకూర నరేశ్ ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అతడి స్నేహితులు(స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2005–06 పదో తరగతి పూర్వ విద్యార్థులు) బుధవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. తాము విరాళాలు సేకరించి మృతుడి కుమార్తె పేరున లక్ష రూపాయల ఫిక్స్ డిపాజిట్ చేసి వాటి పత్రాలను అందించారు. కార్యక్రమంలో అందేల మహేశ్‌యాదవ్, మడ్డి శ్రవణ్‌కుమార్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నల్ల పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 28 : పట్టణంలోని నల్ల పోచమ్మ ఆలయంలో నిర్వహించనున్న విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి పూజ, స్వస్తీవాచనం, అగ్ని ప్రతిష్ఠ, అమ్మవారికి జలాధివాసం, మంగళ హారతి, మంత్రపుష్పం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పునర్నిణ కమిటీ అధ్యక్షుడు కట్కూరి పాండురంగం, గౌరలాధ్యక్షుడు కొయ్యడ నరసింహ, గునిగంటి మల్లేశం, తండా వెంకటేశం, ఉపాధ్యక్షులు డబ్బికార్ సాయిష్, భోగ చంద్రశేఖర్, మంగళపల్లి రాజా రమేశ్, ప్రధాన కార్యదర్శి బొడిగె లింగమ్‌గౌడ్, కోశాధికారి మాటూరి రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

నల్ల పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, బోనాల ఉత్సవానికి రావాలని కోరుతూ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డికి ఆహ్వానం అందించారు. కార్యక్రమంలో టై అండ్ డై అధ్యక్షుడు భారత లవ కుమార్, ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు కట్కూరి పాండురంగం గౌడ్, నాయకులు తండ నాగేశ్, నరసింహ, సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 28 : మండలంలోని తాజ్‌పూర్ గ్రామానికి చెందిన బిట్కూరి లక్ష్మమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్ బుధవారం గ్రామానికి వెళ్లి లక్ష్మమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందించారు. ఆయన వెంట పార్టీ నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

బీబీనగర్, ఆగస్టు 28 : మండల కేంద్రంలో యాదవసంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మల్లికార్జున స్వామి ఆలయానికి ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు మల్లగారి శ్రీనివాస్ బుధవారం రూ.1.20 లక్షల విరాళాన్ని అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు గోలి నరేందర్‌రెడ్డి, టంటం భార్గవ్, ఆలయ కమిటీ సభ్యులు బింగి అచ్చయ్య, పేరబోయిన రాములు, శేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి బెంచీల బహూకరణ

బీబీనగర్, ఆగస్టు 28 : మండలంలోని కొండమడుగు గ్రామ పీహెచ్‌సీకి బుధవారం రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి ఆధ్వర్యంలో పద్మజ సంతాన సాఫల్య కేంద్రం సహకారంతో 5 సిమెంట్ బెంచీలను బహూకరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి మాజీ అధ్యక్షుడు డాక్టర్ శ్రవణ్‌కుమార్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ ముఖద్వార ప్రతిష్ఠాపన పూజలు

రాజాపేట, ఆగస్టు 28 : మండలంలోని నెమిల గ్రామంలోని శివాలయం, చెన్నకేశవ, రామాలయాల్లో బుధవారం ముఖద్వార ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోమాతను ఆలయాల్లో ప్రవేశింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మేక సోమిరెడ్డి, పూజారులు వేదాటి వినయ్, విక్రమ్ పవీణ్, సభ్యులు మేక వెంకటేశ్వర్‌రెడ్డి, ధర్మ హరినాథ్‌రెడ్డి, మేక రాజిరెడ్డి, మేక రమేశ్, సిల్వేరు బాల్‌రాజ్‌గౌడ్, రమేశ్, పులి చంద్రమౌళి, శేఖర్‌రెడ్డి, పాండు, రాజు, రామచంద్ర, శేఖర్, జహంగీర్, శివ, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

రాజాపేట, ఆగస్టు 28 : మండలంలోని పాముకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలకు చెందిన 200 మంది విద్యార్థులకు బుధవారం భువనగిరికి చెందిన ఎన్ఆర్ఐ జిల్లె వెంకట్‌రెడ్డి, డొగిపర్తి శ్రీహరి ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చందా రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రాజాపేట, ఆగస్టు 28 : మండలంలోని బేగంపేట వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. అనుమతి లేకుండా బాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉపేందర్‌యాదవ్ తెలిపారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 28 : మండలంలోని పీపల్‌పహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం దివీస్ పరిశ్రమ ఆధ్వర్యంలో రూ.లక్ష విలువైన నోటు పుస్తకాలు, స్కూల్ బ్యాగులు, బూట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి. గీతారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి; సాగర్, విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి రుణమాఫీ కాని రైతుల వివరాల సేకరణ

రామన్నపేట, ఆగస్టు 28: రేషన్ కార్డులు లేక రైతు రుణమాఫీ కాని రైతుల వివరాలు నమోదు చేసేందుకు గురువారం నుంచి వ్యవసాయ అధికారులు గ్రామాల్లో పర్యటించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి మహ్మద్ ఏజాజ్ అలీఖాన్ తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 29న ఇంద్రపాలనగరం, 30న లక్ష్మాపురం, కొత్తగూడెం, శోభనాద్రిపురం, 31న నీర్నెంముల, నిదాన్‌పల్లి, సెప్టెంబర్ 2న బి.తుర్కపల్లి సూరారం, బాచుప్పల, 3న ఎన్నారం, కుంకుడుపాముల, 4న కక్కిరేణి, 5న పల్లివాడ, మునిపంపుల, 6న రామన్నపేట, కొమ్మాయిగూడెం, 9న దుబ్బాక, జనంపల్లి, 10న ఇస్కిల్ల, ఉత్తటూరు, 11న వెల్లంకి, సర్నేనిగూడెం, 12న సిరిపురం, బోగారం గ్రామాల్లో పర్యటించనున్నట్లు పేర్కొన్నారు. రుణమాఫీ కాని రైతులు దరఖాస్తు ఫారంతో పాటు, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులను అందించాలన్నారు. అధికారులు రైతు కుటుంబ సభ్యుల ఫొటోను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేస్తారని తెలిపారు.

శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న త్రైత సిద్ధాంత, ప్రబోధ సేవాసమితి సభ్యులు

కొండమడుగులో శ్రీకృష్ణ జన్మాష్టమి

బీబీనగర్, ఆగస్టు 28 : శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని కొండమడుగు గ్రామంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ భాషబోయిన పెంటయ్య, మాజీ సర్పంచ్ కడెం లతారాజేశ్‌బాబు, సుర్వి వేణుగౌడ్, త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి సభ్యులు లక్ష్మీనారాయణ, దేవేంద్ర, శంకర్, శివరామకృష్ణ, బుచ్చిబాబు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడికి సన్మానం


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఆలేరు రూరల్, ఆగస్టు 28 : మండలంలోని కొలనుపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సంగి ఇస్తారి ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా బుధవారం పాఠశాలలో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాల్గొని మాట్లాడారు. సమాజానికి దిక్సూచీలు గురువులే అన్నారు. వారి చేతుల్లోనే దేశ భవిత తీర్చి దిద్ద బడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆకుల వేణుగోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడి పనుల ప్రారంభం సందర్భంగా పూజలు చేస్తున్న గ్రామస్తులు

ఎల్లమ గుడి నిర్మాణానికి శంకుస్థాపన

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 28 : మండలంలోని కూరెళ్లలో కాకతీయుల కాలంలో నిర్మించిన పురాతన బావిల ఎల్లమ్మ ఆలయాన్ని పునర్నిణానికి బుధవారం గ్రామస్తులు శంకుస్థాపన చేశారు. దాతల సహకారంతో రూ.50 లక్షలతో గ్రామంలో ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాషబోయిన ఉప్పలయ్య, పంచాయతీ కార్యదర్శి విఘ్నేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

30న సీపీఎం కార్యాలయం ప్రారంభం

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 28 : మండలంలోని పిల్లాయిపల్లి గ్రామంలో నిర్మించిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ కళ్లెం వీరారెడ్డి స్మారక భవనాన్ని ఈ నెల 30న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రారంభించనున్నట్లు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ తెలిపారు. బుధవారం గ్రామంలో నిర్మించిన భవనాన్ని పార్టీ నాయకుడు గూడూరు అంజిరెడ్డి, స్థానిక నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యాలయ ప్రారంభానికి పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. కార్యకర్తలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఆయన వెంట సీపీఎం నాయకులు మంచాల మధు,

గూడూరు బుచ్చిరెడ్డి, గ్రామశాఖ కార్యదర్శి భిక్షపతి, నాయకులు ఉన్నారు.

డెంగ్యూతో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మృతి

సురేశ్‌కుమార్ (ఫైల్)

గుండాల, ఆగస్టు 28: గుండాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.సురేశ్ కుమార్ (54) బుధవారం డెంగ్యూతో మృతి చెందారు. సురేశ్‌కుమార్ రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతూ చికిత్స కోసం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చేరారు. పరీక్షించిన వైద్యులు డెంగ్యూగా నిర్ధారించి చికిత్స అందిస్తున్నారు. అయితే బుధవారం పరిస్థితి విషమించి మల్టీ ఆర్గాన్స్ ఫెల్యూర్‌తో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సురేశ్‌కుమార్ పదేండ్లుగా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా పని చేస్తూ ఎంతో మంది విద్యార్థులను ఉన్నత స్థాయిలో నిలిపారు. మోటివేటెడ్ స్పీకర్‌గా తన ప్రసంగాలతో విద్యార్థులకు దిశానిర్దేశం చేసేవారు. ఆయన మృతితో పట్టణంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. సురేశ్‌కుమార్‌కు భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

వలిగొండ, ఆగస్టు 28: మండలంలోని మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వేములకొండ వద్ద బాల్య వివాహం నిర్వహిస్తుండగా బుధవారం జిల్లా చైల్డ్ వెల్ఫేర్ అధికారులు అడ్డు